# మంగళకైశికి

-యేలూరిపాటి అపర్ణ, బ్రిడ్జివాటర్, న్యూజెర్సీ

ఆంధ్రసాహిత్యచరిత్రలో ప్రబంధకాలానికి రాయలయుగమనే పేరుకూడా ఉంది. దానికి కారణం శ్రీకృష్ణదేవరాయలు సమరాంగణంతోపాటు సాహితీరంగాన్ని కాడా ఏలినవాడుకావటమే. ఆయన సంస్కృతాంధ్రాలలో ఎన్ని ఇతర గ్రంథాలు రచించినా తెలుగులో ఈయన కృతిచేసిన విష్ణుచిత్తీయమనే నామాంతరం గల "ఆముక్తమాల్యద" కే అగ్రతాంబూలం. రాజకవి కావటంవల్ల ఈయన సాహితీపరమైన విన్యాసాలతో పాటు లోకజ్ఞతతో, సమకాలీన సామాజిక జీవనవిధానాన్ని, ఎన్నో నీతికథలనుకూడా తన గ్రంధంలో చిత్రించాడు. అటువంటివాటిలో ఆణిముత్యంలాంటి కథ "మాలదాసరి కథ".

ఆముక్తమాల్యదలో ఒకానొక సంధర్భంలో విష్ణువు లక్ష్మీదేవికి చెప్పిన కథ ఇది. భగవద్గుణ గానంచేత అధమజాతి, అధికజాతి అనే భేదం లేకుండా ఎవరైనా పరమపదం పొందవచ్చుననే సంగతి ఈ కథలో కనిపిస్తుంది. మూలకథ వరాహ పురాణంలో నిది. ప్రధాన కథతో అంతగా సంబంధించనిదైనా ఈ కథను వైష్ణవమతప్రాశస్త్యాన్ని చాటటంకోసం రాయలు ప్రబంధోచితాలైన మార్పులతో గ్రంథస్తం చేశాడు.

ఒక దాసరి "మంగళకైశికి" అనే ప్రత్యేకమైన విష్ణుభక్తి ప్రధానమైన గానాన్ని నిత్యం తెల్లవారుజామున విష్ణుదేవుని గుడిలోకివెళ్ళి ఆయనకు వినిపిస్తూ ఉండేవాడు. అయితే, ఒకనాడు తెల్లవారుఝాము కాకుండానే బయలుదేరి, అడవిమార్గంగుండా వెళ్తున్న అతన్ని ఒక మఱ్ఱిచెట్టుపై ఉండే బ్రహ్మరాక్షసుడు పట్టుకుని, భక్షించబోతాడు. దాసరి తాను ఆలయానికి పోయి, ఆనాటి భగవద్గానం పూర్తిచేసి తిరిగివస్తాను, అప్పుడు తనను భక్షించవచ్చు అంటాడు.

అయినా రాక్షసుడు వానిని విడిచిపెట్టనంటాడు. చివరికి దాసరి - "నేను తిరిగి నీకు ఆహారంగా రాకపోతే - విష్ణువుతో ఇతర దేవతల్ని సమానంగాచేసి కొలిచేవారు ఏనరకాన్ని పొందుతారో నేనుకూడా ఆ నరకానికే పోతాను సుమా" అని శపథం చేస్తాడు. దీనికి రాక్షసుడు చలించి, దాసరిని విడిచిపెట్టి గుడికి వెళ్ళి రమ్మంటాడు. దాసరి సంతోషంతో విష్ణుగుడికి వెళ్ళి, తన గానాన్ని పూర్తిచేసుకొని రాక్షసుని చేరుకొని "ఇప్పుడు నన్ను భక్షించి ఆకలితీర్చుకో" అంటాడు.

ఆసత్యసంధతకు రాక్షసుడు విస్తుపోయి, అతన్ని మహానుభావుడిగా గుర్తించి తనను శాపంవల్ల సంక్రమించిన బ్రహ్మరాక్షసత్వాన్నుంచి విడుదల చేయమని వేడుకుంటాడు. దాసరి ఒప్పుకోకపోవటంతో రాక్షసుడు రామానుజాది మహాపురుషుల పరోపకారపరాయణత్వాన్ని గురించి వివరించి, వారిలాగానే నీవూ దయాళువై నీగానంతో నన్ను పిశాచత్వాన్నుంచి విముక్తిణ్ణి చెయ్యమని దీనంగా ప్రార్థిస్తాడు.

చివరికి దాసరి ఆరోజు తెల్లవారుఝామున తాను పాడిన మంగళకైశికి గానఫలాన్ని ధారపోసి, అతని పిశాచత్వాన్ని తొలగిస్తాడు. రాక్షసుడు పూర్వపు బ్రాహ్మణాకారాన్ని, భాగవతత్వాన్ని పొందుతాడు. అంతకు పూర్వం రాక్షసుడు తనకు పిశాచత్వం ఎలా వచ్చిందో దాసరికి ఇలా వర్ణించాడు.

"నేను పూర్వం చోళదేశంలోని ఒక ఊళ్ళో పండితవంశంలో పుట్టి, అన్ని కళలూ, శాస్త్రాలూ అభ్యసించి, వాటితో రాజసభల్లో చాలామందితో పోటీలు పడి, ఓడిపోయికూడా నేనే గెలిచానని గొప్పలు చెప్పుకుంటూ చిల్లరరాజుల్ని మభ్యపెడుతూ, వాళ్ళిచ్చిన ధనరాశుల్ని లోభత్వంతో దాచుకునేవాణ్ని. సోమయాజుల్లో ఒకణ్ణి అయిపోవాలనే పేరాశతో ఒక యజ్ఞాన్ని తలపెట్టి, వాళ్ళూవీళ్ళూ ఇచ్చిన ధనాన్ని ఒక కోమటికి వడ్డీకి ఇచ్చాను.

కొంతకాలం తర్వాత ఆ ధనాన్ని, ఇతర సామాన్లను పుచ్చుకొని స్వగ్రామం చేరుకొనే సన్నాహంలో ఉండగా, ఒక దొంగ నా ధనాన్ని సంగ్రహించడం కోసం దారికాచి, తన తోటివారితో కలిసి అరణ్యమార్గమధ్యంలో నన్ను చావగొట్టి ధనం అంతా కొల్లగొట్టుకుపోయాడు.

దొంగలగుంపు వెళ్ళిపోగా, చావుకు సిద్ధమైన నన్ను నా బావమరిది వచ్చి కావడిలో ఎక్కించుకొని యింటికి తీసుకువెళ్ళుతుండగా నా ప్రాణం పోయింది. ఆ చివరి గడియల్లో ఆ దొంగ యొక్క క్రూరాకారం నా మనస్సులో నాటుకుపోవటంవల్ల ఆస్మరణతోనే చచ్చి ఘోరరాక్షసుడిగా పుట్టాను. అలా బ్రహ్మరాక్షస జన్మనెత్తిన నేను ఈ మఱ్ఱిచెట్టుపై నివాసముంటూ, దారికాచి నరభక్షణం చేస్తున్నాను. ఏ పుణ్యాత్ముడైనా వచ్చి నన్ను ఈ ఘోర జన్మాన్నించి రక్షించకపోతాడా అని ఎదురుచూస్తున్న నాకు నీవు ఈనాడు ఇలా తటస్థపడి నీ గానప్రభావంతో నన్ను ముక్తుణ్ణి చేశావు" అని అంటాడు.

భక్తి ప్రబోధితమైన ఈ కథలో భగవద్భక్తి ప్రభావంతోపాటు ఎంతో నీతిని, దానితో పాటు ఎన్నో ఉత్తమ లక్షణాలను కూడా కవి నిర్దేశించాడు. మాలదాసరిని గురించి వివరిస్తూ,

"జాత్యుచితచరిత్రమ మత్రీత్యర్థం బూది తనదు హృదయము శుచితా నిత్యంబుగ దత్తను సాంగత్యము మసిపాత మాని కంబై యెదుగున్" అంటాడు రాయలు. దాసరి తన చండాలజాతికి తగిన వృత్తినే చేస్తూ, పొట్ట పోసుకుంటూ మసిపాతలో మాణిక్యంలా శుద్ధప్రవర్తనతో ఉన్నాడు అనటాన్ని బట్టి వర్ణాశ్రమాచారాలను పాటించడం ముఖ్యకర్తవ్యమని తెలుస్తోంది. భగవంతునికి ప్రీతిపాత్రులం అవ్వడానికికూడా అదే ముఖ్యసూత్రమన్నమాట.

విష్ణుభక్తుడైన చండాలుడుకూడా బ్రాహ్మణునికంటే గొప్పవాడేనని దాసరి గొప్పదనాన్ని వర్ణిస్తూ కవి అంటాడు.

"గండాభోగముల న్మదశ్రులహరు ల్గప్పు న్నతుల్వాడి యా
దండ న్వ్రేగులుడించి భక్తిజనితో దృత్తాండవం బాడు నా
చండాలేతరశీలుఁ డుత్పులకియై చాండాలిక న్మీటుచున్
గుండు ల్నీరుగ నెండ గాలి పసితాఁకుం జూడ క్షాప్రాహ్ణమున్ "

ఇది మతవిషయంగా పైకి కనబడినా గృహస్థులకు దైవభక్తి అనేది కూడా చాలా ఆవశ్యకమైనదని కవి చెప్పినట్లయ్యింది.

"హీనజన్మ మఱుట యెవ్వడే నొకప్రాణి సంతసిలుట ముక్తి పొంత గనుట
మేలెకాదె శిబియ మేల్బంతిఁగాడె నశ్వరపుదేహ మమ్మి పరము గొనుట."

ఇక్కడ దాసరి శరీరాన్ని ఆకలిగొన్నవాడికి ఆహారంగా అర్పణ చేయటం మంచిదేననటం ద్వారా పరోపకారం ముఖ్యాచరణీయమని తెలుస్తోంది.

"మున్నీటనైనను మునుంగుట సరియగుటఁ బర్వతంబునకుం బరమాణువునకు నేమి యంతరంబు" అనే సందర్భంలో కూడా సహజంగా మానవుడు ఎలాగూ పుట్టటం చావటం చేస్తూనే ఉంటాడు. కాని, పరోపకారార్థం శరీరాన్ని అప్పగించటం గొప్ప అని కవి హితం చెప్పాడు.

కథలో దాసరి నీచవృత్తితో జీవనం వెళ్ళబుచ్చడం మంచిది కాదని ఉపన్యసిస్తాడు. దాని సారాంశం గౌరవప్రదంగా జీవించడం వల్ల మానవుడు దైవత్వాన్ని పొందవచ్చునన్నదే

"హరికి సఖుఁడును రథమును నగుగరుడుఁడు
దొరికినమృతంబు సురలకు మరలనిచ్చి
యహులు గూడుగ వరమున నడిగి కొనఁడె?
యమృత మైనను జవుల జాత్యన్న సమమె?"

అనే పద్యంలో "అమృత మైనను జవుల జాత్యన్న సమమె?" అనే వాక్యం జనులు జాత్యుచితవృత్తిని పాటించి, జీవనోపాధిని సంపాదించుకోవచ్చని తెలియజేస్తున్నది.

దాసరి రాక్షసుని తనను గుడికి వెళ్ళిరావటానికి అంగీకరించమని వేడుకున్నప్పుడు రాక్షసుడు చేసిన పిడివాదం విని, ఇంక వాడితో వాదించడం అనవసరం అనుకుని నేర్పుగా పని సాధించుకోవాలని నిర్ణయించుకున్నట్లు కవి చెప్పాడు. ఎదుటివారివల్ల ప్రయోజనం సాధించుకోదలచినవాడు వారితో సిద్ధాంతాలమీద వాదం పెట్టుకోకూడదని కవి ఉద్భోధగా భావించాలి. "మూర్ఖం ఛందానురోధన" అనే నీతి యిలాంటి సందర్భాలలో అవసరమన్న మాట.

"ప్రఖ్యాతుండవు దైత్యులందు మునుపాపైనొక్క నీకా యశో
భిఖ్యన్నే నును జేర్తు మే యొసఁగుఁదప్పింపిన్వ్రతం బొక్కఁడే
ముఖ్యంబై యొనరింతు దాని సఫలంబు న్జేయఁగా లేవుగా
'సఖ్యం సాప్తపదీన' మన్మన మిథస్సాజ్గత్య మూహించుచున్ "

ఇలా ఇక్కడ దాసరి రాక్షసుని స్తుతించి తన వైపుకు తిప్పుకొనే ప్రయత్నం చేస్తాడు. దీన్నిబట్టి కొన్ని సందర్భాల్లో ఎదుటివారిని ప్రశంసలద్వారా కూడా మనవైపుకు తిప్పుకోవచ్చని రాయలవారు బోధించినట్లనిపిస్తుంది.

దాసరి గుడినుంచి తన ప్రతిజ్ఞ తీర్చటం కోసం, రాక్షసునికి ఆహారంగా తిరిగివస్తాడు. రాక్షసుడు ఆతని సత్యసంధతను మెచ్చి, దాసరికి పాదాక్రాంతుడు అవుతాడు. ఇక్కడ సత్యవాక్యమహిమతో పాటు దాని ప్రాధాన్యాన్ని కూడా కవి చెప్పాడు.

"ఇతరులు నీకు నీడె మఱి యాధృతి నీస్మృతి నీబుతేరిత
స్థితిగతి నీమురారి పదసేవన జీవనవన్మతిన్ సమా
దృత కలగాన సింధులహరీప్లవన ప్లవభావ భాగురు
శ్రుతి తతబద్ధతుంబికిఁ గురుంగుడినంబికృపావలంబికిన్."

అంటూ రాక్షసుడు దాసరి యొక్క సత్యసంధతను ప్రశంసిస్తాడు. దాసరి తనను రాక్షసుడు తన వైష్ణవ్రతసమాప్తి కోసం విడిచి పుణ్యంకట్టుకున్నాడని కృతజ్ఞతలు తెల్పుకుంటాడు.

దాసరి మంగళకైశికీ గానఫలాన్ని ధారపోయగా రాక్షసుడు మునుపటి బ్రాహ్మణుడై వైరాగ్యంతో తీర్థయాత్రలకు వెళ్ళి మోక్షం పొందినట్లు కవి చెప్తాడు.

ఈ విధంగా శ్రీకృష్ణదేవరాయలు తన ఆముక్తమాల్యదలోని మాలదాసరి కథను హృద్యంగా, భగవద్భక్తిపూరితంగా చిత్రించాడు.